ఘనంగా వైశ్య హాస్టల్ డే



కప్ అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

కాచిగూడ: కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో ఆదివారం హాస్టల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన టూరిజమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడారు. హాస్టల్ డే వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు కప్, బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్, కార్యదర్శి రవి ప్రసన్నకుమార్, కోశాధికారి పొద్దుటూరి రాజేశ్వర్‌రావు, వి.శ్రీనివాస్, టి.శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, శైలేంద్రనాథ్ గుప్తా, వెంకటేశ్వర్‌రావు, ట్రస్టు బోర్డు కోశాధికారి వెంపటి మధు, హాస్టల్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఓఏడీసీ కన్వీనర్‌గా బాబులాల్



నియామకపత్రం అందుకుంటున్న బాబులాల్

ముషీరాబాద్: తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ డెవలప్‌మెంట్ కమిటీ (టీఓఏడీసీ) కన్వీనర్‌గా బాబులాల్ నియమితులయ్యారు. ఆదివారం ఆయనకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాబులాల్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించినందుకు జితేందర్‌రెడ్డి, కార్యదర్శి మల్లారెడ్డి, చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులను మరింత ప్రోత్సహించే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు.

ఉచిత సంగీత శిక్షణ

ఫిలింనగర్: అను మ్యూజిక్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచితంగా సంగీతంలో శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకురాలు పూర్ణిమ తెలిపారు. ఈ నెల 23 నుంచి 30 వరకు ఫిలింనగర్‌లోని తమ అకాడమీలో దేశభక్తి, సంస్కృతి శ్లోకాలపై శిక్షణ ఇస్తామని పూర్తి వివరాలకు 9705058680 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఫైనాన్షియల్ అకౌంటింగ్‌లో శిక్షణ

పంజగుట్ట: ఫ్రైషర్స్ ప్లాట్‌ఫాం గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బీకామ్ పూర్తిచేసిన విద్యార్థులకు ఫైనాన్షియల్ అకౌంటింగ్ ఎక్స్‌పర్ట్స్ పేరుతో ప్రత్యేక కోచింగ్ ఇస్తున్నట్లు సంస్థ సీఈవో సయ్యద్ ముక్రం తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా కంపెనీలు కేవలం 100, 90 శాతం ఉన్న వారినే ఎంపిక చేసుకుంటున్నాయని 50 శాతం కన్నా తక్కువ మార్కులు వచ్చిన వారికి కూడా తాను ఫైనాన్షియల్ అకౌంటింగ్‌లో శిక్షణ ఇస్తానన్నారు. ఈ శిక్షణ 10 రోజులు ఉంటుందని, శిక్షణ పూర్తిచేసుకోగానే ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

రెండో రోజుకు చేరిన అధ్యాపకుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. రెండో రోజు వివిధ వర్సిటీలలో జరిగిన సమ్మె వివరాలను టీజీయూసీటీఏ జేఏసీ నాయకులు వివరించారు. ఓయూ పాలన భవనం ప్రవేశ ద్వారం ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలతో నిరసన తెలిపారు. ఐఐటీ బాసరలో కాంగ్రెస్ పార్టీ గతంలో ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులు వారి కుటుంబ సభ్యులు, పిల్లలతో కలసి సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు డా.ధర్మతేజ, డా.పరుశురామ్, డా.వేల్పుల కుమార్, డా.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పేరిణి నృత్యంలో సాత్విక ప్రతిభ

అఫ్జల్‌గంజ్: పేరిణి నృత్యంతో విద్యార్థిని సాత్విక అందరిని అలరించింది. నారాయణగూడ కేశవ మెమోరియల్ ఇంజినీరింగ్ విద్యార్థిని స్వాతిక పేరిణి నృత్యంలో విశేష ప్రతిభ కనబరిచింది. తెలంగాణ పోలీస్ అకాడమిలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పేరిణికి సంబంధించిన పలు నృత్యాలు చేస్తూ అందరిని ఆకట్టుకుంది. గురువు పేరిణి ప్రకాష్ వద్ద ఆమె నృత్యాలను నేర్చుకుంటుంది. ఈ సందర్భంగా కళాకారిణి సాత్విక మాట్లాడుతూ..జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా విశేష ప్రతిభ కనబరుస్తానని పేర్కొన్నారు. తన గురువు పేరిణి ప్రకాష్ సహకారంతో రాణిస్తున్నట్లు వెల్లడించారు.

ఒక యాప్.. 20 రకాల సేవలు

అందుబాటులోకి టీజీఎస్‌పీడీసీఎల్ అప్లికేషన్ • ఇంటి నుంచే ఫిర్యాదులూ చేయవచ్చు



బంజారాహిల్స్: విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న వారు సమయానికి నంబర్ దొరక్క, తమ సమస్య ఏ దశలో ఉందో తెలుసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. అయితే ముఖ్యంగా కరెంటు మీటర్లలో లోపాలు ఉన్నా, బిల్లింగ్‌లో అవకతవకలు ఉన్నా.. వాటిని సరి చేసుకోవడానికి ఎవరిని సంప్రదించాలో తెలియక సతమతమవుతుంటారు. ఈ నేపథ్యంలోనే విద్యుత్ వినియోగదారుల కోసం దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారుల సమయం, పనుల్లో పారదర్శకతను దృష్టిలో పెట్టుకుని ఒక యాప్‌లో 20 రకాల సేవలు పొందేలా వీలు కల్పించింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినా, బిల్లుల్లో సందేహాలు ఉన్నా, సిబ్బంది అందుబాటులో లేకపోయినా ఏ చిన్న సమస్య తలెత్తినా తమ చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌లో ఈ యాప్ ద్వారానే పరిష్కారం పొందే అవకాశాన్ని కల్పించారు. దీంతో విద్యుత్ వినియోగదారులకు ఈ సేవలు అందుబాటులోకి వచ్చి ఇంట్లో కూర్చొనే తమ సమస్యలు పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించింది.

మీటర్లలో లోపాలు ఉంటే..

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఎల్లారెడ్డిగూడ, సోమాజిగూడ, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్ తదితర సెక్షన్ల పరిధిలో ఈ మొబైల్ యాప్ అందుబాటులోకి వచ్చి 20 రకాల సేవలను అందిస్తోంది. నివాస గృహంలోని మీటర్ కోసం కొత్త సర్వీసు ఎలా పొందాలో తెలుసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న తర్వాత అది మంజూరైందా.. ఏ దశలో ఉందో కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది. సర్వీసు సామర్థ్యం పెంచాలన్నా, మీటర్లలో లోపాలు ఉన్నా మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. ఇంటి నుంచి లేదంటే వ్యాపారం నుంచి గృహ కేటగిరికి మార్చుకునే అవకాశం ఉంటుంది. దానికి అనుగుణంగా యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

రీడింగ్..

స్పాట్ బిల్లింగ్ చేసే వ్యక్తి సరైన సమయంలో రాకుంటే సొంతంగా బిల్లింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది. తాను వినియోగించే విద్యుత్‌ను తానే లెక్కించుకునే అవకాశం కల్పించారు. ప్రతినెలా బిల్లులు చెల్లింపులు, గతంలో చెల్లించిన వివరాలు తెలుసుకోవచ్చు. తాజాగా వస్తున్న బిల్లులను ఈ యాప్ ద్వారా చెల్లించవచ్చు. సరఫరాలో లోపాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదుకు పరిష్కారం ఏ దశలో ఉందో కూడా చూసుకోవచ్చు. పరిష్కారం సంతృప్తికరంగా లేకపోతే మళ్లీ ఫిర్యాదు చేయవచ్చు.

అధికారుల వివరాలు..

తమ పరిధిలోని విద్యుత్ అధికారుల వివరాలు కూడా ఈ యాప్‌లో పొందుబర్చారు. ఏ ప్రాంతానికి ఏ అధికారి బాధ్యుడిగా ఉన్నారో గుర్తించి నేరుగా సదరు సమస్య గురించి ప్రస్తావించి పరిష్కారం పొందవచ్చు. 20 రకాల సేవల ద్వారా సమస్యల పరిష్కారం ఉంటుండడమే కాకుండా ఫీల్డ్‌లో అధికారుల పనితీరు ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి కూడా అవకాశం కల్పించారు.

ప్రజా సమస్యలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

బీజేకే పార్టీ గండె సురేంద్రనాథ్



హిమాయత్‌నగర్ : రైతులు, సైనికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేస్తున్నాయని భారతీయ జవాన్ కిసాన్ పార్టీ(బీజేకేపీ) రాష్ట్ర అధ్యక్షులు గండె సురేంద్రనాథ్ ఆరోపించారు. సమస్యలను పరిష్కరించడానికి జై జవాన్ జై కిసాన్ నినాదంతో బీజేకేపీ అవతరించిందని అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులుగా జాతీయ అధ్యక్షులు నారాయణ ప్రభాకర్ అంకుష్, జాతీయ సమన్వయకర్త సుదర్శి మోహన రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేంద్రనాథ్ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, అరికట్టడం కోసం తమ పార్టీ పని చేస్తుందన్నారు. దేశం కోసం పోరాడిన సైనికులు, దేశానికి అన్నం పెట్టే రైతన్నలు అందరూ ఏకం కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసేందుకు త్వరలోనే జిల్లా పర్యటనలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ నాయకులు జగ్‌బీర్‌సింగ్, తెలంగాణ, ఏపీ నేతలు పి.సత్యప్రసాద్ రావు, దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి, జి.ప్రశాంత్, డి.నారాయణ రెడ్డి, ఆర్.రజిత, ఆర్.సునీత, శివప్రసాద్ గౌడ్, ఎం.రాజయ్య, పి.నిరంజన్ రెడ్డి, ఎం.మాధవరెడ్డి, హనుమంతరావు, ప్రేమ్‌సింగ్ రాథోడ్, టి.మంజుల పాల్గొన్నారు.

జీసస్ బోధనలు మానవాళికి అనుసరణీయం





సందేశమిస్తున్న పాస్టర్ రెవరెండ్ ఆర్.భీముడునాయక్, హాజరైన క్రైస్తవులు

సైదాబాద్: కరుణామయుడైన జీసస్ బోధనలు మానవాళికి అనుసరణీయమని ఫెయిత్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఆర్.భీముడునాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని ఫెయిత్ బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. గుడ్‌ఫ్రై డే రోజు శిలువపై మరణం పొందిన యేసుక్రీస్తు పునరుత్థానం చెందిన పర్వదినమే ఈస్టర్ అని వివరించారు.

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని చర్చిల్లో ఆదివారం ఈస్టర్ ఆరాధనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చిలో జరిగిన ఈస్టర్ ఆరాధనలో పాస్టర్ రెవరెండ్ బోడ సాల్మన్, శాంత్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక పాలసీ తీసుకురావాలి



జర్నలిస్ట్ నాగరాజు సంతాప సభలో టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు మామిడి సోమయ్య

సుందరయ్య విజ్ఞానకేంద్ర: రాష్ట్రంలో నిరంతరం కొనసాగిస్తున్న జర్నలిస్టుల ఆత్మహత్యలు, అనారోగ్య మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. జర్నలిస్ట్ సమస్యలు పరిష్కరించకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో సీనియర్ జర్నలిస్ట్ ఎడ్లపల్లి నాగరాజు సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. ప్రజలలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరిస్తుందని అన్నారు. ఏళ్ల తరబడి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం, సరైన వైద్య సదుపాయలు కల్పించకపోవడం వల్ల జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జర్నలిస్ట్ ఆరోగ్య భద్రతకు ప్రత్యేక పాలసీ తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి నూతన పాలసీ తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు సత్యనారాయణ, పద్మారావు, మోహన్‌రావు, జగన్‌రెడ్డి, యుగంధర్, బాలకృష్ణ, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ



గన్‌ఫౌండ్రీ: ఎంఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మలిశెట్టి సీతారామ్ స్మారక వార్షిక సాహితీ పురస్కార మహోత్సవ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు జజ్జూరి వేణుకి మలిశెట్టి సీతారామ్ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం విశ్రాంత ఐఏఎస్ అధికారి చిన వీరభద్రుడు మాట్లాడుతూ..ప్రపంచ సాహిత్యం నేడు మనకు అందుబాటులో ఉందని తెలిపారు. ప్రజలు సినిమాల నుంచి ఏమీ కోరుకోవడం లేదు కానీ తొక్కిసలాడుతూ..సినిమాలకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఒక అంశంపై రాసేటపుడు నిజం మాత్రమే రాయాలని రచయితపై ఎలాంటి ప్రభావం ఉండకూడదని సూచించారు. అనంతరం కథాప్రపంచం, లోపల ఏదో కదులుతున్నట్లు సాక్షాత్కారం నవల పుస్తకాలను ఆవిష్కరించారు. రమేష్, కార్తీక్ నాయక్, ప్రకాష్, యాకూబ్, అశోక్ పాల్గొన్నారు.

గోల్డెన్ పామ్స్ పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: విద్యానగర్‌లోని గేటెడ్ కమ్యూనిటీ వైదేహి నివాస్ గోల్డెన్ పామ్స్ కోఆపరేటివ్ సొసైటీ పాలకవర్గ సభ్యులు ఆదివారం ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షుడు ఎం.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు జే. రవిందర్, కార్యదర్శి ఎ.కరుణాకర్ శర్మ, కోశాధికారి ఎస్.వెంకటేశ్వర రావు, సభ్యులు జి. కిషోర్‌కుమార్, వి.రవీందర్, ఎంఆర్ కిషోర్‌కుమార్, టి.శ్రీనివాసాచార్యులు, కె.నాగేంద్రకిరణ్‌తో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కో-ఆపరేటివ్ సొసైటీ రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ కె.జనార్దనరెడ్డి ప్రమాణం చేయించారు. సభ్యులందరి సహకారం సలహాలతో కమ్యూనిటీ సమస్యలు పరిష్కరిస్తామని అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి కరుణాకర్ శర్మ హామీ ఇచ్చారు.

వేసవి సంగీత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: శ్రీ సరస్వతి సంగీత విద్యాలయంలో వేసవి సంగీత శిక్షణ (శాస్త్రీయ సంగీతం) తరగతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సోమవారం(నేడు) ప్రారంభమై మే 30 వరకు ఈ సంగీత శిక్షణా తరగతులు కొనసాగుతాయని సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పోపూరి శ్రీనివాస శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సంగీత శిక్షణ ఉంటుందన్నారు. పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాస శర్మ, సంగీత ఉపాధ్యాయుని యశస్వినిలు శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్లు అందజేస్తామని చెప్పారు.

రేపు పురస్కారాల ప్రదానం

పంజగుట్ట: సమీకృత (అంతర్జాతీయ) తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం (ఇట్క్లా) ఆధ్వర్యంలో ఈ నెల 22వ 'ఇట్క్లా-2025 విశ్వ తెలుగు వెలుగు పురస్కారాలు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఇవ్వనున్నట్లు ఇట్క్లా అధ్యక్షుడు కె.ధర్మారావు తెలిపారు. తెలుగు భాషా సంస్కృతి పెంపొందించడం, కళలు, వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి అవార్డులు ఇస్తున్నామన్నారు.

26, 27 తేదీలలో అవార్డుల ప్రదానం

లిబర్టీ: వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న నెట్వర్కింగ్ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ వెల్లడించారు. ఆదిలీలా ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీపుల్ సెలెక్టెడ్ అవార్డులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో ఫోర్ స్టార్ లగ్జరీ రిసార్ట్స్ గోవాలో అవార్డుల అందజేయనున్నట్లు వెల్లడించారు.

మద్యపానం నిషేధించాలి

లిబర్టీ: మద్యపానం నిషేధించి ప్రజల జీవితాలను కాపాడాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు కె.బి.శ్రీధర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లోనూ మద్యం నిషేధించి ఆర్థికంగా కుటుంబాలు నష్టపోకుండా ప్రజల జీవితాలను కాపాడే బాధ్యత పాలకులపై ఉందన్నారు. ఈ సమావేశంలో పుష్పాంజలి, నాగిళ్ల నవీన్ కుమార్ పాల్గొన్నారు.

బీసీలపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం బీసీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుంద్ర కుమారస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు 11 ఏళ్ల కాలంలో ఏ ఒక్క బీసీ సమస్యనైనా కేంద్ర ప్రభుత్వం పరిష్కరించిన దాఖలాలు లేవన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, బహిరంగ సభలు, రాష్ట్రపతి, ప్రధానమంత్రికి విన్నవించినా ఎలాంటి ఫలితం లేకుండా పోతుందన్నారు.

జీరాక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

హిమాయత్‌నగర్: ప్రజలందరికీ సేవ చేయడమే లక్ష్యమని జీరాక్లబ్ అధ్యక్షుడు గౌరీ శంకర్ అన్నారు. జీరాక్లబ్ ఆధ్వర్యంలో కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ రెడ్డి, శ్రీధర్ రావు, మురళీధర్, వినోద్ కుమార్, కమల్ కిషోర్ అగర్వాల్, మహమ్మద్ షరీఫ్, జగన్నాథం, శంకర్ పాల్గొన్నారు.

28 నుంచి శంకర జయంతి మహోత్సవాలు

- 30న శారదాంబకు మహాభిషేకం
- మే 2న శంకర జయంతి, మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం



నల్లకుంట శంకరమఠంలోని శంకరమఠం

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో ఈ నెల 28 నుంచి మే 2వ తేదీ వరకు ఐదు రోజుల పాటు శ్రీ శంకర జయంతి మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శంకర జయంతి ఉత్సవాల వివరాలను శంకరమఠం నల్లకుంట శాఖ ధర్మాధికారి చింతలపాటి శ్రీనివాస మూర్తి నేడు ఒక ప్రకటనలో వివరించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ప్రతి రోజు శక్తి గణపతి, చంద్రమౌళీశ్వర స్వామి, శంకర భగవత్పాదులు, శారదాంబలకు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మఠం ప్రాంగణంలో ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు మహామహోపాధ్యాయ, అద్వైత సిద్ధి రత్నాకర ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిచే 'శ్రీ శంకర విజయం'పై ప్రవచనాలు ఉంటాయని వివరించారు.

అక్షయ తృతీయను పురస్కరించుకొని మహాభిషేకం..

◆ అక్షయ తృతీయను పురస్కరించుకొని నెల 30న ఉదయం 7గంటలకు 'శ్రీ శారదాంబకు మహాభిషేకం'ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం మహా మంగళ హారతి, భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. అలాగే శ్రీ శంకర జయంతిని పురస్కరించుకొని మే 2వ తేదీన ఉదయం 9 గంటలకు శ్రీ శంకర భగవత్పాదులకు 'మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం', మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం 7గంటలకు శంకర భగవత్పాదచార్యుల ఊరేగింపు ఉంటుందని వివరించారు. శంకర జయంతి మహోత్సవాల్లో మహాభిషేకం, శతరుద్రాభిషేకం నిర్వహించాలనుకునే భక్తులు మఠంలో సంప్రదించాలని కోరారు.

కందూరి కృష్ణకు సత్కారం



కందూరి కృష్ణను సత్కరిస్తున్న వాకర్స్ ఇంటర్‌నేషనల్ ప్రతినిధులు

సుందరయ్య విజ్ఞానకేంద్ర: ప్రముఖ సంఘ సేవకులు, 2024 గవర్నర్ కందూరి కృష్ణను సేవా రత్న అవార్డుతో ఆదివారం త్యాగరాయ గానసభలో ఘనంగా సత్కరించారు. ఆదివారం త్యాగరాయ గానసభలో వాకర్స్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలందిస్తున్న ప్రముఖులను గుర్తించి సత్కరించారు. వాకర్స్ ఇంటర్‌నేషనల్ డిస్ట్రిక్ 301 వై శ్రీనివాసులు మాట్లాడుతూ... ప్రతిరోజు అగర్వాల్ ఫౌండేషన్ సహకారంతో 1800 మందికి అల్పాహారం పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రమానందం, డిస్ట్రిక్ గవర్నర్ 2025 లింగ ప్రకాష్, ఇంటర్‌నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, కృష్ణకుమారి, సంపత్‌రెడ్డి, ఎస్.మురళికృష్ణ, ఎస్.మనోహర్‌రెడ్డి, డా. గంగాధర్‌రెడ్డి, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాన్ని పాటించాలి



సుందరయ్య పార్కులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సుందరయ్య విజ్ఞానకేంద్ర: ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలను పాటిస్తూ క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ చేయించుకోవాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి వారితో కలిసి వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సందర్శించిన అధ్యక్షుడు మాట్లాడుతూ. సంపూర్ణ ఆరోగ్యం కోసం ఆరోగ్య నియమాలను పాటించాలన్నారు. ప్రతిరోజు తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ఇటువంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను నగరంలోని పౌరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.రమేష్‌రెడ్డి, మురళికృష్ణ, డా. సునీల్, సైకిలాబ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భోలక్‌పూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు

ముషీరాబాద్: వరంగల్‌లో ఈనెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఎస్‌బీఐ కాలనీలో డివిజన్ బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ముఠా గోపాల్ సారథ్యంలో భోలక్‌పూర్ నుంచి 500 మందికి పైగా కార్లు, బస్సులలో ర్యాలీగా తరలివెళ్లాలని కోరారు. జెండాలు, బ్యానర్లు తోరణాలతో భోలక్‌పూర్‌ను గులాబీమయం చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పరిశీలకుడు దీన్‌దయాల్ రెడ్డి, బింగి నవీన్, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, డివిజన్ మాజీ అధ్యక్షులు మహ్మద్ ఆలీ, బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, మనవర్‌చాంద్, చాంద్‌పాషా, జబ్బర్, కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యువ కళాకారులు.. సాంస్కృతిక రాయబారులు



సుల్తాన్‌బజార్: శాస్త్రీయ సంగీత నృత్యాలు, లలిత కళలు, భారతీయ సాంస్కృతిలో భాగమని రాష్ట్ర ఖజాన, లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర అన్నారు. శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో నవ్య నాటక సమితి నిర్వహించిన మూడు రోజుల చైత్ర చంద్రిక అభినయ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జి.వసుంధర హాజరై ఔత్సాహిక కళాకారులకు వర్క్‌షాప్‌లో శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యువ కళాకారులందరూ మన సాంస్కృతిక రాయబారులన్నారు. అనేక మంది కళాకారులు ఉత్సాహ బరితంగా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహక సంస్థ పక్షాన నాట్య గురువు స్వప్న సుందరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇందిరా హేమ, లక్ష్మీమానస, మాధవి మాల, విజయ్‌కుమార్, బాలాజీ, కృష్ణ కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

• నృత్య ప్రదర్శన



చిన్నారులతో నాట్య గురువు వేదాంతం రాధేశ్యామ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సౌజన్యంతో పంచమ వేద నాట్య నిలయం 23వ వార్షికోత్సవాన్ని ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య గురువు ఆర్.కనకదుర్గ శిష్యబృందం వివిధ అంశాలపై ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ నాట్య గురువు వేదాంతం రాధేశ్యామ్ ముఖ్యఅతిథిగా హాజరై కళాకరులు, చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, విశ్రాంత ఆచార్యులు ఆర్.ప్రసన్న రాణి, యువ కళావాహిణి అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ, విశ్రాంత భరతనాట్యం అధ్యాపకురాలు మంజులరాణి తదితరులు పాల్గొన్నారు.